సాక్షి
నిజామాబాద్
బుధవారం । 14 । మే । 2025



టమాట ధర మరింత పతనం

టమాట ధర మరింత పతనమైంది. సాగు చేసిన రైతులను నిండా ముంచుతోంది. ప్రస్తుతం కిలో టమాట రూ.2 పలుకుతోంది.
- 8లో ▸



జిల్లాను మొదటిస్థానంలో..

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణనిచ్చే విషయంలో జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని ఏఎంవో బాలకృష్ణ పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.8 /22.5

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తగ్గవచ్చు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పాలిసెట్–2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. మొత్తం 6,542 మంది విద్యార్థులకు గాను 6,111 మంది పరీక్షకు హాజరయ్యారు.

'సరస్వతి' పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న

ఖలీల్‌వాడి: కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాలకు సరస్వతీ నది తీరాన అనేక పుణ్యస్నాన ఘాట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లే భక్తుల కోసం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 26 వరకు భూపాలపల్లి, కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ నుంచి స్పెషల్ హైర్ పద్ధతిలో ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా డిపాజిట్ లేకుండానే ముందస్తుగా బస్సులను బుక్ చేసుకొని, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని తెలిపారు.

మోడల్ స్కూల్ ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు వచ్చిన మార్కులు, ర్యాంకుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. 14,473 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక ప్రక్రియ సంబంధిత మోడల్ స్కూల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'తెలంగాణ రన్' అంబాసిడర్‌గా అశోక్



వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెల 8న నిర్వహించనున్న తెలంగాణ రన్– 2025కు బ్రాండ్ అంబాసిడర్‌గా వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రన్నర్ గుగ్గిలం అశోక్‌ను ఎంపిక చేసింది. తన ఎంపికను అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మంగళవారం ప్రకటించినట్లు అశోక్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని రవాణా శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న అశోక్ దశాబ్దానికి పైగా రాష్ట్ర, జాతీయస్థాయి రన్నింగ్ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 2కే, 3కే, 10కే, 21కే విభాగాలలో తెలంగాణ రన్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం సేకరణ

రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో ఇప్పటి వరకు జిల్లాలో 7.79 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయింది. మొత్తం రూ.1,800 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా రూ.1,440.52 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు. జిల్లా వ్యాప్తంగా 4.15 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేయగా, 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు.



- ఇప్పటివరకు మొత్తం 7,79,924 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఇందులో 7,03,103 మెట్రిక్ టన్నుల సన్నరకం, 76,821 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం
- మరో లక్ష మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో భారీగా సేకరణ జరుగుతోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందూరు జిల్లాలో అధికారులు ధాన్యం సేకరించడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 598 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం సేకరిస్తోంది. ఇందులో 466 కేంద్రాల ద్వారా సన్నరకం, 132 కేంద్రాల ద్వారా దొడ్డురకం ధాన్యం సేకరిస్తున్నారు. మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 7,03,103 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరణ అయింది. 76,821 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం వచ్చింది. మొత్తం కలిపి 7,79,924 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయింది.

ఈ సీజన్ పూర్తయ్యేలోగా ఇంకా 1 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారుల అంచనా. జిల్లాలోని రైతులకు సుమారు రూ.400 కోట్ల మేర ప్రభుత్వం బోనస్ ఇవ్వాల్సి ఉంటుంది.

■ మొత్తం 89,216 మంది రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటివరకు 75,634 మంది రైతులకు రూ.1,440.52 కోట్ల ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.1,800 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశారు.

సన్నరకాలకు ఇప్పటివరకు రూ.1,333.52 కోట్లు చెల్లింపులు చేశారు. దొడ్డు రకాలకు సంబంధించి రూ.107 కోట్లు చెల్లింపులు చేశారు. మొత్తం రూ.1,440.52 కోట్లు రైతులకు చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు.

■ జిల్లా వ్యాప్తంగా 4.15 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. సేకరణకు ఇంకా సమయమున్నప్పటికీ అంచనాలకు మించి రికార్డు స్థాయిలో ధాన్యం రావడం గమనార్హం. జిల్లాలో మొత్తం 226 మిల్లులకు ధాన్యం కేటాయింపులను ప్రభుత్వం చేసింది. ధాన్యం సేకరణ విషయంలో పకడ్బందీగా చర్యలు తీసుకుని ముందుకెళ్లడంతో రికార్డు స్థాయిలో ధాన్యం వచ్చిందని కలెక్టర్ 'సాక్షి'కి తెలిపారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విషయంలోనూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామన్నారు.

కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఆర్మూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో విస్తృత పర్యటన
- నిర్వాహకులపై మండిపడ్డ కలెక్టర్



మోర్తాడ్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆర్మూర్/ మోర్తాడ్/ కమ్మర్‌పల్లి : వరి ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతు అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ ర్మూర్ మండల కేంద్రంలోని ధోబీఘాట్, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, మోర్తాడ్ మండలం తిమ్మా పూర్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతు ల నుంచి సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన బస్తాల వివరాలను నిర్వాహకులను అడిగారు. అక్కడే ఉన్న రైతులను పలకరించి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధోబీఘాట్ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో జా ప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దష్టికి తేగా, నిర్వాహకుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నప్పటికీ ధాన్యం సేకరణలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీశారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యానికి తావిచ్చే సొసైటీలకు వచ్చే సీజన్‌లో కేంద్రాలను కేటాయించొద్దని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటదివెంట నిర్దేశిత మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మిల్లర్లు సకాలంలో ధాన్యం బస్తాలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. సూపర్ అమాన్ రకం ధాన్యం తీసుకునేందుకు పలువురు మిల్లర్లు విముఖత చూపుతున్నారని కేంద్రాల నిర్వాహకులు తెలుపగా, మిల్లర్లతో సమావేశమై ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ దాదాపుగా తుది దశకు చేర్చారని, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని హితవు పలికారు. ఆలస్యంగా పంట దిగుబడులు చేతికి అందినా అన్ని ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని, పంట విక్రయం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని కలెక్టర్ భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, డీపీఎం సాయిలు తదితరులు ఉన్నారు.



ఆర్మూర్ శివారులోని ధోబీఘాట్ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిగ్రీ పరీక్షలకు గ్రీన్ సిగ్నల్

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. సీఎం రేవంత్ రెడ్డి హామీతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సమ్మె విరమించాయి. దీంతో ఈ నెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- సీఎం హామీతో సమ్మె విరమించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ఊపిరిపీల్చుకున్న విద్యార్థులు, వర్సిటీ అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీల పరిధిలో గత నెలాఖరున ప్రారంభం కావాల్సిన డిగ్రీ పరీక్షలు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సమ్మెతో వరుసగా వాయిదా పడుతూ వస్తున్నాయి. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తేనే డిగ్రీ పరీక్షలకు సహకరిస్తామని లేదంటే సమ్మె కొనసాగిస్తామని కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. కొన్ని వర్సిటీల పరిధిలో డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫీజులను సైతం ఆయా యూనివర్సిటీలకు కళాశాలల యాజమాన్యాలు చెల్లించలేదు. ఒకవైపు యాజమాన్యాలు సమ్మెకు దిగడం, మరోవైపు బుధవారం నుంచి పలు వర్సిటీల్లో పరీక్షలు జరగాల్సి ఉండగా.. అసలు ఈ పరీక్షలు జరిగేనా? లేదా? అనే సందిగ్ధత డిగ్రీ ఫైనలియర్ విద్యార్థుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ప్రతినిధులతో సోమవారం చర్చలు జరిపారు. చర్చలు ఫలప్రదం కావడంతో డిగ్రీ పరీక్షలకు మార్గం సుగమమయ్యింది. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని, రీయింబర్స్‌మెంట్ బకాయిలిచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, రూ.300 కోట్ల బకాయిల విడుదలకు సీఎం హామీ ఇచ్చారని సమ్మెను విరమించాలని బాలకిష్టారెడ్డి కోరారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించాయి. రాష్ట్ర కమిటీ సూచన మేరకు తెలంగాణ వర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు ఈ నెల 16 నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలకు పూర్తిగా సహకరిస్తామని వర్సిటీ ఉన్నతాధికారులకు మంగళవారం తెలియజేశారు. దీంతో అటు విద్యార్థులు, ఇటు వర్సిటీ ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి డిగ్రీ హాల్‌టికెట్లు పంపిణీ

తెలంగాణ వర్సిటీ పరిధిలో ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ (2020 నుంచి 2024 వరకు) 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఈ నెల 14 నుంచి కళాశాలల్లో హాల్‌టికెట్లు పొందవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ మంగళవారం తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు సాధించేలా..

- ఉపాధ్యాయులకు ప్రారంభమైన వృత్యంతర శిక్షణ
- విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి సామర్థ్యాల పెంపుపై ప్రధాన దృష్టి

నిజామాబాద్ అర్బన్: విద్యా సంవత్సరం పూర్తి కాగానే విద్యార్థులు పైతరగతులకు వెళుతున్నారు. అయితే వారిలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందడం లేదు. చదవడం, రాయడం, గణిత చతుర్విధ ప్రక్రియలైన కూడిక, తీసివేత, భాగాహారం, గుణకారాలు రావడం లేదు. ఇటీవల ప్రథమ్ సంస్థ నిర్వహించిన అసర్ ఫలితాల్లో ఇదే తేటతెల్లమైంది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో ఎదురవుతున్న అవరోధాలను అధిగమించేందుకు విద్యాశాఖ ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో వృత్యంతర శిక్షణ ప్రారంభించింది.

తొలిమెట్టు తనిఖీలతో వెలుగులోకి..



శిక్షణ ఇస్తున్న జిల్లా రీసోర్స్ పర్సన్ రాములు

విద్యాశాఖ గత మార్చి నెలలో రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు అమలుపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణిత చతుర్విధ ప్రక్రియలో చేస్తున్న తప్పులను గుర్తించారు. ప్రధానంగా అక్షర గుర్తింపు, ధ్వని గుర్తింపు సరిగా చేయకపోవడం, పాఠ్య పుస్తకంలోని అంశాలను చదివి గ్రంథాలయ పుస్తకాలు దినపత్రికలు చదవకపోవడం, పదాలు, వాక్యాలను తప్పుగా రాయడాన్ని గుర్తించారు. అలాగే చతుర్విధ ప్రక్రియలో భాగంగా కూడికలు, తీసివేతలు చేస్తున్నా గుణకారాలు, భాగాహారాలు చేయడంలో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ఇటీవల ప్రథమ్ అనే సంస్థ విడుదల చేసిన అసర్ నివేదిక ప్రకారం మూడు, ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకాన్ని చదవలేక పోతున్నారు. రెండో తరగతి చతుర్విధ ప్రక్రియలను 60 శాతం మంది ఐదో తరగతి విద్యార్థులు చేయలేకపోతున్నట్లు గుర్తించారు.

అవరోధాలు అధిగమించేందుకు..

ప్రస్తుతం జరుగుతున్న వృత్యంతర శిక్షణలో ఉపాధ్యాయులకు తెలుగు మౌఖిక భాషాభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ధారాళంగా చదవడం కోసం పఠన కృత్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. లేఖనాభివృద్ధి కోసం లేఖన సంసిద్ధత కార్యక్రమాలు, విద్యార్థుల్లో ప్రారంభ నైపుణ్యాలను బలోపేతం చేసేందుకు వారిలో కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు నిత్య జీవితంలో ఎదురయ్యే గణిత సమస్యలైన చతుర్విధ ప్రక్రియలు సులభంగా ఎలా నేర్పాలో తర్ఫీదునిస్తున్నారు.

సెలవుల్లో నిర్వహించడం మంచిది



విద్యార్థులకు అభ్యసన నష్టం జరగకుండా సెలవుల్లో శిక్షణ ఇవ్వడం మంచి నిర్ణయం. శిక్షణలో సబ్జెక్టుల వారీగా సమర్థవంతమైన శిక్షణ తీసుకుంటున్నాం. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు మెరుగ్గా రాణించేలా తయారు చేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది.
– అంకం నరేశ్, మండల రీసోర్స్ పర్సన్

శిక్షణ ఎంతో మేలు చేస్తుంది



విద్యార్థులు చదవడం, రాయడంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు, బోధన ఫలవంతంగా ముగించడంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. చతుర్విధ ప్రక్రియలు, పఠన, లేఖనాభివృద్ధికి మరింత మేలు చేస్తుంది.
– బోయడ నర్సయ్య, జిల్లా రీసోర్స్ పర్సన్

సజ్జ రైతులకు మంచి రోజులు

- ధర తగ్గినా దిగుబడి పెరిగి ప్రయోజనం
- గతంలో కంటే ఒక్కో క్వింటాలుకు రూ.900 తగ్గిన ధర
- ఒక్కో ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి



మోర్తాడ్ మండలం దోన్‌పాల్‌లో సాగవుతున్న సజ్జ పంట

మోర్తాడ్(బాల్కొండ): సజ్జ సాగు చేసిన రైతులకు ఈసారి మంచి రోజులు వచ్చాయి. పంటకు ధర తగ్గినా దిగుబడి పెరగడంతో కొంత ప్రయోజనం కలిగిందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. సజ్జ దిగుబడి గతంలో ఎకరానికి 13 నుంచి 14 క్వింటాళ్ల వరకు లభించగా ఈసారి కొన్ని కంపెనీలు సరఫరా చేసిన విత్తనాలతో దిగుబడి 18 నుంచి 20 క్వింటాళ్లకు పెరిగింది. గతంలో ఒక్కో క్వింటాలుకు రూ.7,500 లభించగా ఈ సారి రూ.6,600లకే కొనుగోలు చేస్తున్నారు. ధర తగ్గినా దిగుబడి పెరగడంతో రైతులకు మరో విధంగా లాభం కలుగుతోంది. 80 రోజులలో సాగయ్యే ఈ రకం పంటకు ఒక్కో ఎకరానికి రూ.10 వేల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. దిగుబడి పెరగడంతో రైతులకు రూ.లక్ష వరకు ఆదాయం సమకూరుతుంది. గతంలో కోతలు పూర్తి కావడం, ధర ఒప్పందం జరగకపోవడం తదితర కారణాలతో పంటను కొనుగోలు చేసేందుకు సీడ్ వ్యాపారులు, మధ్యవర్తులు ఎక్కువ సమయం తీసుకునేవారు. ఇప్పుడు మాత్రం ఏ రోజు పంటను కోస్తే అదే రోజు లోడింగ్ చేసి తరలించేందుకు వ్యాపారులు సిద్ధం కావడం విశేషం. పసుపు సాగు చేసిన భూముల్లోనే ఈసారి సజ్జ పంట వేయడంతో సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాల నుంచి 15 వేల ఎకరాలకు పెరిగింది.

సజ్జ సాగుతో నష్టం లేదు



యాసంగి సీజన్‌లో సజ్జ సాగుతో రైతులకు ఎలాంటి నష్టం లేదు. గతంలో సజ్జను తరలించేందుకు ఎక్కువ సమయం పట్టేది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, పంటను కోసిన వెంటనే తరలిస్తుండటంతో రైతులకు మేలు జరుగుతోంది. రెండు, మూడు రోజుల వ్యవధిలోనే పంటకు సంబంధించిన డబ్బులు జమ చేస్తున్నారు. – గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

రుణ లక్ష్యం..రూ.1,228 కోట్లు

- ఖరారైన బ్యాంకు లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక
- 19,969 ఎస్‌హెచ్‌జీలకు రుణాలివ్వాలని టార్గెట్



డొంకేశ్వర్(ఆర్మూర్): బ్యాంకు లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 19,969 మహిళా సంఘాలకు రూ.1,228 కోట్ల రుణాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఐతే, రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లాకే ఎక్కువ లక్ష్యాన్ని ఇచ్చారు. గతేడాదితో పోలిస్తే టార్గెట్ ఏ మాత్రం పెరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు వచ్చిన టార్గెట్‌ను మండలాల వారీగా కేటాయించారు. ప్రస్తుతం వీవోల వారీగా విభజించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అత్యధికంగా బోధన్ మండలానికి రూ.77.46 కోట్లు, తర్వాత నందిపేట్ మండలానికి రూ. 74.90 కోట్లు నిర్దేశించారు. అత్యల్పంగా మోస్రా మండలానికి రూ.16.78 కోట్లు ఇచ్చారు. జిల్లాకు నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని గతేడాది స్ఫూర్తితో చేరుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) లక్ష్యానికి మించి 16,060 మహిళా సంఘాలకు రూ.1320.73 కోట్ల రుణాలను (107.49శాతం) అందించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్నారు.

ఖరారుకాని స్త్రీనిధి టార్గెట్

బ్యాంకు లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక రెడీ కాగా స్త్రీనిధికి కొత్త లక్ష్యం ఇంకా ఖరారు కాలేదు. జిల్లాల వారీగా వార్షిక ప్రణాళిక తయారు కాలేదని తెలుస్తోంది. నెలాఖరు నాటికి వచ్చే అవకాశాలున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. పోయిన ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి టార్గెట్ రూ.211కోట్లు ఉండగా లక్ష్యానికి మించి రూ.216కోట్లు (102 శాతం) మహిళా సంఘాలకు అందించారు.

టార్గెట్‌ను చేరుకుంటాం..



గ్రామీణాభివృద్ధి శాఖకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ టార్గెట్‌ను చేరుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తాం. గతేడాది స్ఫూర్తితో పనిచేస్తాం. సమీక్షలు నిర్వహించి రుణాల పంపిణీని వేగవంతం చేస్తాం. స్త్రీనిధి కొత్త టార్గెట్ త్వరలో వస్తుంది. – సాయాగౌడ్, డీఆర్డీవో

క్లుప్తంగా

ఎల్‌ఎల్‌బీ రీవాల్యుయేషన్ దరఖాస్తుకు నేడే ఆఖరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు మే 14 (బుధవారం) తుది గడువని కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రీవాల్యుయేషన్ ఒక్కో పేపర్‌కు రూ.500లు, దరఖాస్తు ఫారానికి రూ.25 ఫీజు చెల్లించి సంబంధిత కళాశాలలో నేడు అందజేయాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఈ నెల 15న సాయంత్రం 4 గంటల లోపు రీవాల్యుయేషన్ ఫీజు చెల్లింపు చలాన్, దరఖాస్తు ఫారాలను యూనివర్సిటీ పరీక్షల విభాగంలో అందజేయాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ రూరల్: తెలంగాణ రత్న, తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధుల, వికలాంగుల, విద్యా, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ, సినీరంగాలలో సేవలందిస్తున్నవారు, ప్రతిభావంతులు పురస్కారాల ఎంపికకు అర్హులన్నారు. వారి సేవలను, ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్స్ ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలతోపాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి మే 25లోపు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి డోర్‌నెం.1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు: తిరుమలగిరి, సికింద్రాబాద్-15నకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9652347207ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణితం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు విద్యా విషయక అంశాలపై ఐదు రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు బోధన పద్ధతులు మెరుగుపర్చుకోవడం, తమ సబ్జెక్టుల్లో నిపుణత సాధించడం, అత్యాధునిక టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసుకోవడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు కోర్స్ ఇన్‌చార్జి, హెచ్‌ఎం శంకర్ తెలిపారు. కార్యక్రమాన్ని డీఈవో అశోక్, డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పరిశీలించారు. శిక్షణకు 300 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

టమాట ధర మరింత పతనం

- కిలోకు రూ.2కి పడిపోయిన ధర
- 25 కిలోల బాక్స్ ధర రూ. 50
- కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- రైతులకు తీవ్ర నష్టం



బుస్సాపూర్‌లో టమాట తెంపుతున్న కూలీలు

బాల్కొండ: టమాట ధర మరింత పతనమైంది. ఎన్నో ఆశలతో సాగు చేసిన టమాట రైతులను నిండా ముంచుతోంది. ధర రోజురోజుకూ తగ్గుతూనే ఉంది. ప్రస్తుతం రైతుల వద్ద కిలో టమాటకు రూ.2 ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 25 కిలోల టమాట బాక్స్ ధర రూ.50 నుంచి రూ.60 చెల్లిస్తున్నారు. దీంతో సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టమాట తెంపే కూలి డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 10 రోజుల క్రితం వరకు కిలో రూ.4 చెల్లించగా, ప్రస్తుతం కిలో రూ.2 చెల్లించి కొనుగోలు చేసేందుకు కూడా వ్యాపారులు ముందుకు రావడం లేదు.

వదిలి పెట్టలేక..

కష్టపడి పండించిన టమాటను వదిలిపెట్టలేక చేతి నుంచే కూలి డబ్బులు పెట్టి తెంపిస్తున్నారు. టమాటను మొక్కపై వదిలేస్తే పంటకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఒక్కసారిగా టమాట ధర పెరిగితే కొంతమేరైనా నష్టాన్ని పూడ్చుకోవచ్చనే ఆశతో టమాటను తెంపుతున్నారు. ప్రస్తుతం టమాట పంటను దున్ని ఇతర పంటలను పెట్టే అవకాశం లేకపోవడంతో ఉన్న దాంట్లోనే నష్టం రాకుండా చూసుకోవాలని రైతులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం టమాట రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

తెగుళ్లు వస్తాయని..



టమాట పంటకు ప్రస్తుతం ఉన్న ధర కూలీలకు కూడా నిండడం లేదు. అలానే వదిలేస్తే పంటకు తెగుళ్లు సోకుతాయనే భయంతో తెంపుతున్నాం. మధ్యలో ధర పెరుగుతుందని ఆశిస్తున్నాం.

– చిన్నయ్య, రైతు, బుస్సాపూర్

సీబీఎస్ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



సుహాబి బన్సాల్ 490 మార్కులు



కనక్ ఇనాని 476 మార్కులు



రీథా బజాజ్ 465 మార్కులు



సహస్వీ శ్రీరామ్ 451 మార్కులు

- 490 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థి సుహాబి బన్సాల్
- 90శాతానికి పైగా మార్కులు సాధించిన పలువురు



సంవేద్య 449 మార్కులు



సహస్ర 448 మార్కులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాల విద్యార్థులు, నవీపేట మండలం జన్నెపల్లిలోని ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. జన్నెపల్లి పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాల విద్యార్థి కనక్ ఇనాని 476/500 మార్కులు సాధించారు. రీథా బజాజ్ 465, సహస్వీ శ్రీరామ్ 451, సంవేద్య 449, సహస్ర 448, శ్రీవేణు 446, శివ చైతన్య 444, నవ్య 443, కీర్తి రెడ్డి 441, యేషిత్ రెడ్డి 439 మార్కులు సాధించారు. ముగ్గురు విద్యార్థులకు 95శాతం కంటే ఎక్కువ మార్కులు, 24 మంది విద్యార్థులు 90శాతంపైగా మార్కులు సాధించారు. 34 మంది విద్యార్థులు 80శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మారయ్య గౌడ్ తెలిపారు. అలాగే మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి సుహాబి బన్సాల్ 490 మార్కులు సాధించి, జిల్లా టాపర్‌గా నిలిచారు. బాసెట్టి తన్మయి 466 మార్కులు, అర్జిత్ బౌమిక్ 460, నిహాన్‌రెడ్డి 456, లాస్య 444 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్, కరస్పాండెంట్ శ్రీదేవి అభినందించారు.

గాలివానకు ధ్వంసమైన ఇళ్ల పరిశీలన



అచ్చాయపల్లిలో ధ్వంసమైన ఇళ్ల వివరాలు సేకరిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచ్చాయపల్లిలో సోమవారంరాత్రి కురిసిన గాలివానకు పలువురి ఇళ్లు ధ్వంసమయ్యాయి. గ్రామంలోని ఓ ఇంటిపై చెట్టు విరిగిపడటంతో పక్కనే ఉన్న బాత్‌రూం ధ్వంసమైంది. పాఠశాల పక్కనే చెట్టు సైతం కూలిపడడంతో పాఠశాల ఆవరణలోని కిచెన్‌షెడ్డు ధ్వంసమైంది. దీంతోపాటు గ్రామంలో విద్యుత్‌వైర్లు తెగి స్తంభం సైతం విరిగిపోయింది. మంగళవారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, పంచాయతీ ప్రత్యేకాధికారి పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాములు తదితరులు గ్రామానికి చేరుకొని గాలివానకు ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. గాలివాన తీవ్రతకు 8ఇళ్లు పూర్తిగా, మరో 12ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు వారు తెలిపారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి బాలకృష్ణ

నిజామాబాద్‌అర్బన్: విద్యాబోధనలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణ నిచ్చే విషయంలో రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంవో) బాలకృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారన్నారు. నగరంలో హైదరాబాద్‌పబ్లిక్ స్కూల్ లో మంగళవారం సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యులార్ అండ్ థెరపిక్ స్ట్రాటజీస్ ఫర్ సీడబ్ల్యూఎస్ఎన్ (చైల్డ్ విత్ స్పెషల్ నీడ్) అనే అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవో ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. దివ్యాంగ విద్యార్థులకు సాధారణ తరగతి గదిలో సాధారణ విద్యార్థులతోపాటు విద్యా బోధనపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఐఈ కో-ఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ జయరాం నాయక్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ (డీఆర్పీ)లు శ్రీనివాస్ రెడ్డి, మురళి, మమత, ప్రకాష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలంగాణ ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నీ

- పాల్గొననున్న జాతీయ క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఉమెన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీ ఈ నెల 15 నుంచి 22 వరకు స్థానిక ఉమెన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ మంతెన రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన డీకే ఆర్ ఫుట్‌బాల్ క్లబ్, పీకేఆర్ ఫుట్‌బాల్ క్లబ్, మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్, యెర్రపల్లి సరస్వతి ఎఫ్‌సీ జట్టు, కేర్ ఫుట్‌బాల్ అకాడమీ జట్లు పాల్గొంటున్నాయన్నారు. టోర్నీలో ఇండియా జట్టుకు క్వాలిఫై అయిన క్రీడాకారులు ఆడతారన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు ఇండియన్ ఫుట్‌బాల్ ఉమెన్స్ లీగ్‌కు క్వాలిఫై అవుతుందని తెలిపారు. జిల్లాలో మొదటిసారి ఫ్లడ్ లైట్స్ వెలుతురులో టోర్నీ నిర్వహిస్తున్నామని, ప్రారంభ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. టోర్నీని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఫారూక్, జావిద్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. టోర్నమెంట్ కన్వీనర్‌గా డాక్టర్ కవితారాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యెర్రం సుధీర్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా నిర్మించుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేక అధికారి రాజారాం సమక్షంలో సిబ్బంది మార్కింగ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికి ఇళ్లు మంజూరు చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, శివాజీ, రాజేశ్వర్‌రెడ్డి, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. గ్రామంలో నలుగురు లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. ప్రభుత్వం నుంచి రూ. 4 లక్షల చొప్పున డబ్బులు చెల్లించామ న్నారు.



తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

ఆయన వెంట హౌసింగ్ ఏఈ గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజంపేట : మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి కె అపర్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం మండల పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ విషయంపై అవగాహన కల్పించారు. రాజీవ్ యువ వికాసం బ్యాంకర్స్, మేనేజర్ కలిసి సిబిల్స్ చెక్ చేయడంపై వివరించారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు



పిట్లం(జుక్కల్): మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారి 161పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. శంకరంపేట్ మండలంలోని ఆరపల్లి గ్రామానికి చెందిన బైక్‌పై సోమవారం రాత్రి అంతర్గాం నుంచి మాసన్‌పల్లి గ్రామానికి బయలుదేరాడు. పిట్లం మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై అతడి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో సాయిలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. తీవ్రగాయాలైన వారిని చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108లో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికు తరలించారు.

బస్సు కిందపడి మహిళ మృతి



ఎడపల్లి(బోధన్): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన చాకలి నాగమణి ఇటీవల పని నిమిత్తం నిజామాబాద్ వచ్చింది. మంగళవారం బోధన్ బస్ ఎక్కి మంగళపాడ్ వద్ద దిగింది. అయితే నాగమణి బస్సు ముందు నుంచి వెళ్తుండగా డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఆమె చక్రాల కింద పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన దండుగుల ఎల్లయ్య(57) భార్య మూడు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడి ఆరోగ్యపరిస్థితి బాగా లేదు. దీంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగ మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

వేల్పూర్ మండల కేంద్రంలో..

వేల్పూర్: ఘర్షణలో గాయపడిన ఓ వ్యక్తి పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ థాబ్రేజ్ (38), గుపాల్వార్ శ్రీనివాస్, అమ్మాల్వార్ వెంకటేశ్ కలిసి ఇంటి కూన పెంకులు మరమ్మతుల పనిచేసేవారు. ఇటీవల పనిచేసిన చోట కూలీ డబ్బుల విషమై ఏర్పడిన విభేదాలతో షేక్ థాబ్రేజ్‌ను శ్రీనివాస్, వెంకటేశ్ కర్రలతో తీవ్రంగా గాయపర్చారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మంగళవారం అతడిని ఇంటికి తీసుకురాగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి సోదరి ఖలేదా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భిక్కనూరు టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ జామ్



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద మంగళవారం గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ వాహనం టోల్‌ప్లాజా మీదుగా వెళ్తు అక్కడ ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్ని ధ్వంసం చేసింది. దీంతో వేకువజామున నెట్‌వర్క్ సిగ్నల్ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గంట తర్వాత సిబ్బంది మరమ్మతులు చేయడంతో ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా నాయకుడి అరెస్టు



ముఠా నాయకుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సందీప్, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు సిద్దిపేట్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఎ1- దాసరి మురళీకృష్ణ, ఎ-2 దాసరి నర్సయ్య, ఏ3-గణేష్, ఏ4- రాజేష్, ఏ5- రావుల శివ, ఏ6-సమ్మక్క, ఏ7-భవాని, ఏ8-రేణుక, ఏ9-నాగయ్యలు సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, దొంగల ముఠాగా ఏర్పడి, గత కొన్ని నెలలుగా చోరీలకు పాల్పడుతున్నారు. గత నెలలో ముఠాలోని ఇద్దరి సభ్యులను (రాజేష్, రావుల శివ) లను పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన సభ్యుల కోసం డిచ్‌పల్లి సీఐ మల్లేష్ పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలు గాలించగా మంగళవారం ఇందల్వాయి ఎస్సై సందీప్, సిబ్బంది కలిసి ముఠాలోని ముఖ్య నాయకుడు దాసరి మురళీకృష్ణను పట్టుకున్నారు. నిందితుల నుంచి 7తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అలాగే మొబైల్‌ఫోన్, రూ.1500 నగదు, రెండు రోల్డ్‌గోల్డ్ నెక్లెస్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మురళి ఇదివరకే నేర చరిత్ర కలిగి, పలుమార్లు జైలుకు వెళ్లాడు.

బోరుమోటార్ల చోరీ కేసులో నిందితులు..



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో చోటుచేసుకున్న బోరుమోటార్ల దొంగతనం కేసులో మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాలలో గత రెండు, మూడునెలలుగా వరుసగా బోరుమోటార్ల దొంగతనం జరిగింది. బోరుమోటార్ల దొంగతనంపై పలువురు రైతుల ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈక్రమంలో మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన పోతరాజు రాములు అలియాస్ తుకారం, ఈటెల శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు దొంగతనం చేసినట్లు అంగీకరించారని తెలిపారు. మొత్తం 18మోటార్లను దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారన్నారు. ప్రస్తుతం 6మోటార్లను, దొంగతనం చేసేందుకు వినియోగించిన బైక్‌ను రికవరీ చేశామన్నారు. మోటార్లను బోయిని సత్యం అనే వ్యక్తి తీసుకున్నట్లు తమకు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతుందని, విచారణ పూర్తయిన తర్వాత మరిన్ని మోటార్లు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాములు, శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి, ఏఎస్సై ఉమేశ్, కానిస్టేబుల్ సందీప్, హోంగార్డులు రాజు,ఆశయ్య ఉన్నారు.

సూర్బిర్యాల్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం సూర్బిర్యాల్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన షేక్ జమాలుద్దీన్(29) భార్య సంవత్సరం క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై, తరచూ బాధపడుతుండేవాడు. కాగ ఈనెల 10న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించిన ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని చెరువులో అతడు శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పెద్దకొడప్గల్కు చెందిన సయ్యద్ గౌస్ (56) కొంతకాలంగా కామారెడ్డికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబంతో కలిసి బతుకమ్మకుంటలో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసై కొద్ది రోజులుగా ఏ పని చేయడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలను పోలీసులు కాపాడిన ఘటన కమ్మర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన సామెర మురళి, తన కొడుకు ముఖేష్ చంద్ర చెరో బైక్‌పై భీమ్‌గల్ వెళ్లి మంగళవారం అర్ధరాత్రి తిరిగి చౌట్‌పల్లికి బయలుదేరారు. మురళి ఇంటికి చేరుకోగా, ముఖేష్‌చంద్ర ఇంటికి చేరుకోలేదు. దీంతో మురళి కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎస్సై స్పందించి బ్లూకోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సర్జన్‌కుమార్, హోంగార్డు గణపతిలను అలర్ట్ చేసి, ముఖేష్ చంద్ర లోకేషన్ ట్రాక్ చేశారు. కానిస్టేబుళ్లు బషీరాబాద్ నుంచి కోనసముందర్ వరకు వెతుకుతుండగా.. కాడి చెరువు సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లో స్పృహ కోల్పోయి ఉన్న ముఖేష్ చంద్రను గుర్తించారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడటంతో కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ఇటీవల సిబ్బంది డ్రంకన్‌డ్రైవ్ తనఖీలు చేపట్టారు. ఈక్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 46 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం జిల్లా మార్నింగ్ కోర్టులో మంగళవారం వారిని హాజరు పర్చగా స్పెషల్ జ్యూడీషియల్ 2వ క్లాస్ మెజిస్ట్రేటు నూర్జహన్ బేగం వారిలో 22 మందికి జరిమానాలు విధించగా, 24 మందికి జైలు శిక్ష విధించారు. వారిలో ముగ్గురికి మూడు రోజులు, 12 మందికి రెండురోజులు, 9 మందికి ఒక రోజు శిక్షలు విధించినట్లు ఏసీపీ తెలిపారు.

ధర్పల్లి మండలంలో..

ధర్పల్లి: మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దుల్ చౌరస్తా వద్ద ఈనెల 6న పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. దీంతో పోలీసులు అతడిని నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఏడుగురు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం ఆర్మూర్ కోర్టు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై రామ్ తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: నవీపేట శివారులో రెండు రోజుల కిందట పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఐదుగురు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

నందిపేట మండలంలో..

నందిపేట: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఆర్మూర్‌లోని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరుపర్చగా 8మందికి రూ.2000 చొప్పున జరిమానా విధించగా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

దుకాణ నిర్వాహకులకు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో రాత్రి సమయంలో దుకాణాలు నడిపిస్తున్న ముగ్గురిని అరెస్టు చేయగా, జడ్జి రెండు రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. పెర్కిట్‌లో ప్రతిరోజుల రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా మదీనా హోటల్, మదీనా పాన్‌షాప్, యాసీన్ హోటల్‌లు నడిపిస్తున్న షేక్ మాజీద్, షేక్ సాజిద్, షేక్ ఫారుక్‌లపై ఇటీవల పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పర్చగా మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్‌రెడ్డి వారికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.